క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కమలాకర్

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణానికి చెందిన పలువురు యువకులు శుక్రవారం బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కొత్తపల్లి పట్టణం నుంచి కరీంనగర్‌లోని మీ సేవా కార్యాలయం వరకు బైక్ ర్యాలీపై వచ్చిన సుమారు 200 మంది యువకులకు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి మంత్రి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వై.సునీల్‌రావు, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు వాసాల రమేశ్, జేరిపోతుల మొండయ్య, మానుపాటి వేణుగోపాల్, గండు రాంబాబు, చింతల సత్యనారాయణరెడ్డి, నాయకులు జమీలొద్దీన్, శ్రీకాంత్, ఎస్కే బాబా, రమేశ్, శేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమివ్వాలి



షర్మిలతో మాట్లాడుతున్న వరాల శ్రీనివాస్

కరీంనగర్ రూరల్: వైఎస్సార్ టీపీ నుంచి కరీంనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ వైఎస్సార్‌టీపీ నాయకుడు వరాల శ్రీనివాస్ శుక్రవారం హైదరాబాద్‌లో షర్మిలను కలిసి విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను వివరించారు. మున్నూరుకాపు సామాజికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తనకు అవకాశం కల్పించాలని కోరగా బీసీలకు అత్యధిక స్థానాలు కేటాయిస్తామని షర్మిల హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిక



కరీంనగర్: బీఎస్పీ పార్టీకి చెందిన మొహమ్మద్ అబ్దుల్ జమీల్ శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నగరంలోని హుస్సేనపురాకు చెందిన అబ్దుల్ జమీల్ బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, బాంసెఫ్ కార్యకర్తగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవశ్యకతను గుర్తించి బీఎస్పీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా డిస్ట్రిక్ కోఆర్డినేటర్ అమీర్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, నాలుగో డివిజన్ అధ్యక్షుడు సర్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.





చైతన్యపురిలోని మహాశక్తి ఆలయం

- ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు
- రోజూ రాత్రి 9 గంటలకు దాండియా నృత్యాలు
- 20న అమ్మవారి పల్లకి సేవ

శరన్నవరాత్రి ఉత్సవాలకు మహాశక్తి ఆలయం ముస్తాబు

కరీంనగర్‌కల్చరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు కరీంనగర్‌లోని చైతన్యపురిలో గల మహాశక్తి ఆలయం ముస్తాబైంది. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు వేకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసరాలు, వీధులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణాన్ని, ఆలయానికి వచ్చే రహదారులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. వివిధ విద్యుద్దీపాల ఆకృతిలో దేవుళ్లు, ప్రతిమలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు, శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీ స్వాముల ఆశీస్సులతో ఈనెల 15 నుంచి ప్రారంభమవుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు 23వ తేదీ వరకు జరుగనున్నాయి. ప్రతిరోజూ రాత్రి యువతీ, యువకుల దాండియా నృత్యాలు ఆకట్టుకోనున్నాయి.

రోజు వారి పూజల వివరాలు

- ఈనెల 15న తొలి రోజు ఆదివారం ఉదయం 8 గంటలకు శ్రీబాలా త్రిపుర సుందరి దేవీ (శైలపుత్రి) అవతారం, స్వస్తి పుణ్యహవాచనం, గణపతి పూజ, అంకురారోపణము, అఖండ దీపారాధన, సర్వతోబద్రమండలం, అమ్మ



ఆలయ ముఖద్వారం

వారికి ప్రతిరోజూ చతుషష్టి ఉపచారపూజ, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం 6 గంటలకు శ్రీమహాదుర్గా అమ్మవారికి ఫలపంచామృత అభిషేక కార్యక్రమాలు.
- ఈనెల 16న సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీగాయత్రీ దేవి (బ్రహ్మచారిని) అవతారం. అమ్మవారికి పూలతో అలంకరణ. సాయంత్రం 6 గంటలకు లింగార్చన.
- 17న మంగళవారం ఉదయం 8 గంటలకు శ్రీఅన్నపూర్ణ దేవి (చంద్ర ఘంట) అవతారం, అమ్మవారికి శాకాంబరీ అలంకరణ. సాయంత్రం 6 గంటలకు సుహాసినులచే సామూహిక కుంకుమ పూజలు, కేబీ శర్మ బృందంతో భక్తి సంగీత విభావరి.
- 18న బుధవారం ఉదయం 8 గంటలకు శ్రీమహాలక్ష్మి దేవి (కూష్మాండ) అవతారం, చీరలతో అలంకరణ. సాయంత్రం 6 గంటలకు సౌందర్య లహరి, కనకధార స్తోత్ర పారాయణం.
- 19న గురువారం శ్రీమహాచండీ దేవి (స్కంద మాత) అవతారం, పండ్లతో అలంకరణ. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి చందనాభిషేకం.
- 20న శుక్రవారం మూలా నక్షత్రం శ్రీసరస్వతీ దేవి (కాత్యాయని) అవతారం, సాయంత్రం 6 గంటలకు విద్యార్థులతో సరస్వతీ పూజ, పల్లకి సేవ, రతన్ కుమార్ శిష్య బృందంచే శాస్త్రీయ ఆలయ నృత్యాలు.
- 21న శనివారం ఉదయం 8 గంటలకు శ్రీ లలితాదేవి (కాళరాత్రి) అవతారం, గాజులతో అలంకరణ. సాయంత్రం 6 గంటలకు లలితా సహస్రనామ పారాయణం.
- 22న ఆదివారం దుర్గాష్టమి, శ్రీదుర్గాదేవి (మహాగౌరీ) అవతారం, రుద్రసహిత చండీ హోమం. సాయంత్రం 6 గంటలకు అమ్మవారి సన్నిధిలో బతుకమ్మ పూజలు.
- 23న సోమవారం విజయదశమి, ఉదయం 8 గంటలకు, మహిషాసురమర్ధిని దేవి, శ్రీరాజ రాజేశ్వరి దేవి (సిద్ధి రాత్రి) అవతారం, శమీ పూజ, ఉదయం 7 గంటల నుంచి వాహనపూజలు, సాయంత్రం 6 గంటలకు మహిషాసుర మర్ధిని పూజ.

చిత్ర కథ – పూల పండుగకు రెడీ



బతుకమ్మ పండుగ అంటేనే పూల పండుగ. అందులో బంతిపూలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. కరీంనగర్ మండలం గుంటూరుపల్లి, గోపాల్‌పూర్, తాహెర్‌కొండాపూర్ తదితర గ్రామాల్లోని కొందరు రైతులు బంతిపూల పంటను సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన తోటల్లో బంతిపూలు విరబూసి పండుగకు సిద్ధమన్నట్లుగా కనువిందు చేస్తున్నాయి. - కరీంనగర్‌రూరల్

రోడ్డుపైనే చెత్త.. లీకేజీ నీళ్లు



నగరంలోని ఓల్డ్ లేబర్ అడ్డా వద్ద నడిరోడ్డుపై ఓ వైపు చెత్తాచెదారం.. మరోవైపు పైపులైన్ లీకేజీతో నిలుస్తున్న నీటితో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నగరంలో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. లీకేజీని సరిచేసి, నీరు నిల్వకుండా చేయాలని, చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - కరీంనగర్ కార్పొరేషన్

నిరాధార ఆరోపణలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై చంద్రశేఖర్

కొత్తపల్లి: తప్పుడు డాక్యుమెంట్లను చూపిస్తూ సంఘంలో గౌరవప్రదమైన హోదాలో ఉన్న వ్యక్తుల పేర్లను పేర్కొంటూ వారి వల్ల ప్రాణహాని ఉందని, అతనికి పోలీసులు సహకరిస్తున్నారంటూ ప్రతిష్ట భంగం కలిగేలా నిరాధార ఆరోపణలు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1971లో మల్కాపూర్‌లోని సర్వే నంబర్ 30 నందు రెండు ఎకరాల భూమిని పట్టాదారుల నుంచి చేగుర్తి గ్రామానికి చెందిన చామనపల్లి మల్లయ్య కొనుగోలు చేసి అందులో నుంచి 35 గుంటల నుంచి భూమిని ఆరుగురుకి విక్రయించగా, వీరంతా 16 ప్లాట్లుగా విభజించి అమ్మేశారు. అయితే ఈ భూమి తాను జేరిపోతుల లింగయ్య వద్ద కొనుగోలు చేశానని కరీంనగర్ తిరుమల్‌నగర్‌కు చెందిన చెట్టి వెంకటరమణ చెప్పడంతో పాటు ఇంజక్షన్ ఆర్డర్ ఉండగా లక్ష్మీపూర్‌కు చెందిన పలువురు బెదిరిస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. నిజాలను వదిలి ప్రెస్‌మీట్ పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించిన వెంకటరమణపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు అఖిల పక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో

కరీంనగర్: రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ వైఫల్యం, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు శనివారం కరీంనగర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్నట్లు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మిలుకూరి వాసుదేవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డిలు సంయుక్తంగా ప్రకటనలో పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మన్, సభ్యులను తొలగించి కొత్త సభ్యులను నియమించాలన్నారు. డీఎస్సీ పోస్టుల సంఖ్యను ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా 13,500కు పెంచాలని, పరీక్షల రద్దుకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ బాధ్యత వహించి పరీక్షలు రాసిన అభ్యర్థులకు రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.







నగరంలో బతుకమ్మ సందడి

బతుకమ్మ పండుగ సంబరాలు శనివారం నుంచి ప్రారంభమవుతుండటంతో శుక్రవారం నగరంలో బతుకమ్మ సందడి నెలకొంది. తొలిరోజైన శనివారం ఎంగిలి పూల బతుకమ్మను పేర్చడానికి అవసరమైన గుమ్మడి ఆకులు, గుమ్మడి పూలు, గునుగపువ్వు, తంగేడు పూలు, బంతి, పట్టుకుచ్చులు, వెదురు సిబ్బిల అమ్మకాలతో మార్కెట్ రోడ్ కళకళలాడింది. - విద్యానగర్(కరీంనగర్)

బీఎస్ఎన్ఎల్ వ్యవస్థాపక దినోత్సవం



ప్రశంసాపత్రాలు స్వీకరించిన విద్యార్థులతో నరేందర్‌రెడ్డి, డీజీఎం దినేశ్

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్‌లో బీఎస్ఎన్ఎల్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డితో కలిసి బీఎస్ఎన్ఎల్ డీజీఎం దినేశ్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం ప్రధాన కార్యదర్శిగా సుదర్శనం



సుదర్శనం

కరీంనగర్: గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నలుమాసు సుదర్శనం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సత్తు పురుషోత్తం పెద్దపల్లి జిల్లాకు బదిలీ కావడంతో ప్రధాన కార్యదర్శి పదవి ఖాళీ అయింది. రాష్ట్ర కమిటీ సూచన మేరకు జిల్లా కమిటీలో పదవులను భర్తీ చేశారు. సుదర్శనం గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. కాగా సుదర్శనం ఎంపిక పట్ల పలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సుదర్శనం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉన్నతి కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు పర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

స్టీల్ కర్రీ బౌల్స్, స్నాక్స్ పంపిణీ



పంపిణీ చేస్తున్న హామ్ స్వచ్ఛంధ సంస్థ బాధ్యులు

కరీంనగర్‌కల్చరల్: హామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని గాయత్రీనగర్‌లో ఉన్న కపిల్ బాల కుటీర్‌లో విద్యార్థులకు 50 స్టీల్ కర్రీ బౌల్స్, స్నాక్స్ (అరటి పండ్లు, బిస్కట్స్) ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సాగర్ శ్రీనివాస్, రమణ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు.. పర్యావరణ హితం



మట్టితో తయారు చేసిన దుర్గాదేవి విగ్రహం

కరీంనగర్‌రూరల్: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పర్యావరణహితానికి దోహదపడే మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఆదివారం ప్రారంభం కానున్న శరన్నవ రాత్రి ఉత్సవాల కోసం మట్టి దుర్గాదేవి విగ్రహాలు సిద్ధమయ్యాయి. బొమ్మకల్‌బైపాస్‌లో పదేళ్లగా గాయత్రి మట్టి విగ్రహాల తయారీ సంస్థ వినాయక, దుర్గాదేవి మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. నెలరోజుల నుంచి కలకత్తాకు చెందిన కళాకారులు 4 అడుగుల నుంచి 15 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు తయారు చేసి ఆకర్షణీయమైన రంగులతో తీర్చిదిద్దారు. దుర్గా నవరాత్రులను నిర్వహించే ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం నుంచి విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకపోతున్నారు.

మధుసూదనాచారి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వోపా బాధ్యులు

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను శుక్రవారం నగరంలో జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేములవాడ ద్రోణాచారి, ప్రధాన కార్యదర్శి గజ్జెల హరిహరాచారి, కోశాధికారి యాస్వాడ అంజయ్య, ఉపాధ్యక్షుడు గద్దె సత్యనారాయణ, దుంపెటపల్లి లక్ష్మీనారాయణలు కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వేడుకల్లో అసోసియేషన్ నాయకులు విశ్వనాథం దేవణాచారి, గాలిపెల్లి బ్రహ్మచారి, యాస్వాడ చంద్రయ్య, పుసాల బ్రహ్మనందం, చొప్పదండి విద్యాసాగర్, రావుల చొక్కయ్య, గాలిపెల్లి శంకరయ్య, వంగళ సత్యనారాయణ, మడుపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాప్ నిర్వాహకుల బైండోవర్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరుగురు మద్యం బెల్ట్‌షాప్ నిర్వాహకులను శుక్రవారం తహసీల్దార్ నవీన్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. రాబోయే ఎన్నికలను పురస్కరించుకుని బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు



సిద్ధార్థ పాఠశాలలో..



విద్యాధరి పాఠశాలలో..



శివాని డిగ్రీ, పీజీ కళాశాలలో ..

కరీంనగర్‌లోని పలు విద్యాసంస్థల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణను మామిడి తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు, తల్లిదండ్రులు సంప్రదాయ దుస్తులతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగురంగుల పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చి ఒక చోట పెట్టి కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. పలు విద్యాసంస్థల్లో పెద్దఎత్తున బతుకమ్మలను తయారు చేశారు. అంతకు ముందు ఈ వేడుకలను ఆయా విద్యాసంస్థల అధినేతలు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీక బతుకమ్మ పండుగన్నారు. మహిళందరూ సంబురంగా తొమ్మిది రోజుల పాటు ఆడుతూ పాడుతూ సంబురంగా చేసుకుంటారని తెలిపారు. ఈ వేడుకల్లో విద్యాసంస్థల అధినేతలు, డైరెక్టర్లు ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్/సప్తగిరికాలనీ/కరీంనగర్‌సిటీ/కొత్తపల్లి



విశ్వశాంతి పాఠశాలలో..



వింధ్యావాలి పాఠశాలలో..



భట్రాజు సంఘం ఆధ్వర్యంలో..



బావుపేట వికాస్ హైస్కూల్‌లో..



కొత్తపల్లిలోని సెయింట్‌జార్జ్ స్కూల్‌లో..



కిమ్స్‌లో ..